క్లుప్తంగా

విస్తారంగా వర్షాలు

ఉదయగిరి: మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో మూడ్రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఆదివారం ఉదయం వరకు ఉదయగిరిలో 101.4, కలిగిరిలో 73.4, కొండాపురంలో 68.8, దుత్తలూరులో 68.4, వింజమూరు 53.4, సీతారామపురంలో 30.6, వరికుంటపాడులో 30.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కావలిలో వర్షపాతం

కావలి: కావలిలో ఆదివారం ఉదయానికి 21.6 మి.మీ వర్షపాతం నమోదైంది.దగదర్తిలో 74.2 మి.మీ, అల్లూరులో 30.8 మి.మీ, బోగోలులో 17.2 మి.మీ. చొప్పున నమోదైందని ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తెలిపారు.

దుర్గంపై పర్యాటకుల సందడి



ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దుర్గం కొండపై నుంచి జలపాతాలు జాలువారుతున్నాయి. కొండలు పచ్చదనాన్ని పరుచుకుని ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయగిరి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో దుర్గంపైకి చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు.సెల్వార్‌పేట కొలనులో మునుగుతూ ఆనందంగా గడిపారు.

సెలవురోజు తరగతుల నిర్వహణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థల్లో ఆదివారం కూడా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకూడదు. అయినా నిబంధనలను తుంగలోతొక్కి తరగతులు నిర్వహించడంపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభ్యంతరం తెలుపుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై మండల విద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న వానరాలు

సీతారామపురం : మండల కేంద్రమైన సీతారామపురంలో ప్రజలను వానరాలు హడలెత్తిస్తున్నాయి. ఇక్కడ కొద్దిరోజులుగా వానరాల బెడద అధికమైంది. చేతిలో చిన్న పొట్లాలతో చిన్నారులు, మహిళలు కనిపిస్తే వెంటపడి మరి దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇళ్లలోకి దూరి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. బస్టాండ్ సెంటర్‌లోని షాపులపై ఎగబడి మరీ తినబండారాలను తీసుకెళ్తున్నాయి. దీంతో నష్టపోతున్నామని చిరువ్యాపారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి కోతుల సమస్యను తీసుకెళ్లినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన



సోమశిల: అనంతసాగరంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పీ శ్రీధర్‌రెడ్డి రబీ సాగులో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి విత్తనాలకు కిలోకు రూ.5 సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలను సూచించారు.

పరామర్శ

కావలి: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగయ్యను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగయ్య గాయపడడంతో ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆశీర్వచనం

బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం జరిగిన దగదర్తి మండలం కొత్తపల్లి కౌరగుంట వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతలబోయిన వెంకటేశ్వర్లు సోదరుడి కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఉదయగిరి: గంగులవారిపల్లి చెరువుపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆదివారం దాడులు నిర్వహించారు. ముగ్గురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.3,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీతారామపురం, మర్రిపాడు ఎస్సైలు శివకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రబీ సాగుకు సన్నాహాలు



కావలి పెద్ద చెరువులో చేరిన వర్షపు నీరు



రైతుసేవా కేంద్రానికి చేరిన వరి విత్తనాలు

- విస్తారంగా వర్షాలు
- చెరువుల్లో చేరిన సాగునీరు
- విత్తనాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు

కావలి: కావలి నియోజకవర్గంలో గత వారం వాయుగుండం ప్రభావంతో నాలుగురోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు, కాలువలు జలకళను సంతరించుకోవడంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కావలి పట్టణం, రూరల్, బోగోలు, దగదర్తి మండలాలతో పాటు అల్లూరు మండలంలోని కొంత భాగం రైతులు వర్షాలపై ఆధారపడి వరి సాగు చేస్తారు. వర్షాలు బాగా కురిసి సాగునీటి వనరుల్లో నీరు చేరితే రెండు కార్లు పంటలు వేస్తారు. గతేడాది సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ సాగు చేపట్టలేదు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో రబీ సాగుకు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మూడు నుంచి మూడున్నర నెలల్లో సాగు పూర్తయ్యే స్వల్ప కాలిక రకాలైన ఆర్ఎన్నార్ 15048, కేఎంఎం 1638, ఎంటీయూ 1010, తదితర రకాల విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు.

90వేల ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలో సుమారు 90వేల ఎకరాల్లో రబీ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నియోజకవర్గంలో 95 వరకు సాగునీటి వనరులు ఉన్నాయి. వాటిలో గత వారం కురిసిన వర్షాలకు 2 టీఎంసీల మేర నీరు చేరింది. ఒక టీఎంసీ తో 10వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టవచ్చు. ప్రస్తు తం అందుబాటులో ఉన్న నీటితో నార్లు పోయడం, నాట్లు వేయడం వంటి కీలక ఘట్టాలను పూర్తి చేయవచ్చు. రాబోయే మూడు నెలల కాలంలో కనీసం 8 టీఎంసీలు అవసరం. సోమశిలలో 58 టీఎంసీలకుపైగా నీరు ఉండడం ..వర్షాలు విస్తారంగా పడుతాయన్న నమ్మకంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

రైతుసేవా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావలి వ్యవసాయాధికారిణి లలిత తెలిపారు. బీపీటీ-5204, కేఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-15048 రకాలను రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. బీపీటీ-5204 రకం 135 నుంచి 145 రోజుల్లో చేతికందుతుంది. బస్తా రూ.1045కాగా, సబ్సిడీపై రూ. 920కు ఇస్తున్నట్లు చెప్పారు. కేఎన్ఎం-1638 రకం కాలపరిమితి 120-125 కలిగి ఉంటుంది. బస్తా రూ.1215 కాగా, సబ్సిడీపై రూ.1065కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎన్ఆర్-15048 రకం కాలపరిమితి 125 రోజులు కలిగి ఉంటుందని చెప్పారు. బస్తా రూ.1045 కాగా, సబ్సిడీపై రూ.920కే అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బయట కొనుగోలు చేసే వారు లైసెన్సులు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే తీసుకోవాలని, ఖచ్చితంగా రశీదులు పొందాలని సూచించారు. విత్తనాలను ముందుగా మొలక కట్టి చల్లుకోవాలని తెలిపారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి

సీతారామపురం : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై శివకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక చెక్‌పోస్టు కూడలిలో వాహనచోదకులకు ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానాలు విధిస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులు విధిగా కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రూ.22.40 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం



నర్రవాడలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు : మండలంలోని దుత్తలూరు, నర్రవాడ, కొత్తపేట గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి పల్లెపండగలో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలో రూ.22.40 కోట్లతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం, పంచాయతీరాజ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు లక్ష్మీనరసింహులు

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లి-కృష్ణాపురం నడుమ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన రమణబోయిన లక్ష్మీనరసింహులు పని నిమిత్తమై ద్విచక్రవాహనంపై బద్వేల్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి సమీపంలో రోడ్డుపై అడ్డు వచ్చిన గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. పోలీసులు క్షతగాత్రుడి వివరాలు నమోదు చేసుకున్నారు.

పాపకన్ను మృతిపై సంతాపం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాపూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి మృతిపై ఆ పార్టీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ అల్లారెడ్డి అనసూయమ్మ ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు. పాపకన్ను మృతి పార్టీకి తీరని లోటు అని వారు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని సాతానుపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు ఆదివారం దేవతా మూర్తుల విగ్రహాలకు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఆత్మకూరుకు చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ పూనుగుంట రేవతి, ప్రముఖ న్యాయవాది నందా ఓబులేసు, ఆలయ కమిటీ నిర్వాహకులు దావా పెంచలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తూర్పురాజగోపుర ద్వారబంధం ఏర్పాటు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో నూతనంగా నిర్మిస్తున్న తూర్పురాజగోపురానికి ద్వారబంధం ప్రతిష్ఠాపన వేడుకను సోమవారం నిర్వహించనున్నట్లు దాత మన్నెమాల సుకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు, ఆలయ అర్చకుల సూచన మేరకు ఉదయం 8 గంటలకు ద్వారబంధం ప్రతిష్ఠాపన జరుగుతుందని పేర్కొన్నారు. స్వామివారి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ద్వారబంధం ఏర్పాటు, ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరారు.

గండిపాళెం జలాశయానికి 220 క్యూసెక్కుల వరద

ఉదయగిరి: గండిపాళెం జలాశయంలో 11.5 అడుగుల మేర నీటిమట్టం చేరిందని ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి ఆదివారం తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి 220 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరిందన్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగులు కాగా, ప్రస్తుతం 11.5 అడుగుల మేర నీరు ఉందని తెలిపారు.

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

- ఈ నెల 22 నుంచి ప్రత్యేక శిబిరాలు
- జిల్లాలో ఆధార్ నవీకరణకు నోచుకోని వారు 4,75,932 మంది



చిన్నారి వివరాలు నమోదుచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్(ఫైల్)

సీతారామపురం: ప్రభుత్వ పథకాల లబ్ధి, బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, విద్యా, ఉద్యోగాల్లో ప్రవేశాలకు ఆధార్ నంబర్ తప్పనిసరిగా మారింది. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోయినా, అందులో సాంకేతిక తప్పిదాలు ఉన్నా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతిఒక్కరికీ ఆధార్‌కార్డు ఉండాలని, ఇప్పటికే దాన్ని తీసుకుని చాలాకాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా చాలామంది ముందుకు రావడం లేదు. ఆధార్ అవసరమైనప్పుడు మాత్రం ఇబ్బంది ఏమిటో తెలుస్తుంది. అప్పుడు ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తుంటారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు సేవలు అందిస్తాయి. పదేళ్లుగా వేలిముద్రలు, నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో ఇతర సమాచారాన్ని నవీకరించుకోని వారు జిల్లాలో 4,75,932 మంది ఉన్నారు. వారిలో 5 నుంచి 15 ఏళ్లలోపు వారు 88,398 మంది ఉండగా, 15 నుంచి 17 ఏళ్ల వయస్సు వారు 1,49,570 మంది, 18 ఏళ్లు పైబడిన వారు 2,37,966 మంది ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇంటికి చేరువలోనే ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదు. గతంలో పూర్తిస్థాయి సమాచారం పొందుపరచకపోవడంతో చాలావరకు తిరస్కరణకు గురయ్యాయి. గతంలో ప్రత్యేక శిబిరాల్లో నమోదుచేసుకున్న వారు నిర్ణీత ధ్రువపత్రాలు సమర్పించకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో పది శాతం తిరస్కరణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. తర్వాత సిబ్బందికి శిక్షణ అవసరమని తేల్చారు. ఆధార్‌కార్డుకు వయస్సుతో నిమిత్తం లేదు. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా ఆధార్ తీసుకునే వీలుంది. ఐదేళ్లలోపు పిల్లల వేలిముద్రలు నిక్షిప్తం కావు. ఐదేళ్లు దాటాక వీరంతా బయోమెట్రిక్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వారు తమ వేలిముద్రలు, కనుపాపల పునర్వ్యకరణ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. కొత్త ఆధార్‌కార్డుల నమోదు, వేలిముద్రలు,, చిరునామాలు, వ్యక్తిగత ఫొటో నవీకరణ, మొబైల్ నంబరు మార్పు, ఇతర దోషాలు పరిహరించుకునేందుకు శిబిరాలు దోహదపడతాయి. ఈ శిబిరాలను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు. సాధ్యమైనంత ఎక్కువమంది సేవలు అందుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రధానంగా వీరిదే.

మంచి అవకాశం



ఆధార్ సేవలందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఇది మంచి అవకాశం. వేలిముద్రల నవీకరణతో పాటు ఇతర ఆధార్ సమస్యల పరిష్కారానికి ఇవి ఎంతగానో దోహదపడతాయి.

–భాస్కర్, ఎంపీడీఓ, సీతారామపురం

ఏపీ కత్వా నూతన కార్యవర్గ ఎన్నిక



ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీ కత్వా) సమావేశాన్ని పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఏపీ కత్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా తోట చిన్న వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడుగా కొలగాని పెంచలయ్య, సహాధ్యక్షుడుగా నలిశెట్టి శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శిగా కొండమూరి శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా ఊసా చలపతి, సహకార్యదర్శిగా మలిశెట్టి వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శిగా ఎం అంజనీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పీ నాగేశ్వరి, తంబా అంకయ్య, సోమా వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సంగం: మండలంలోని తలుపూరుపాడు, చెన్నవరప్పాడు, కొరిమెర్ల గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పాదలకూరు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానుడు యుద్ధరంగంలో మొదటిరోజు అర్జునుడికి భగవద్గీతను ప్రవచించారని తెలిపారు. భగవద్గీతలోని ధర్మసారాంశాన్ని ప్రతిఒక్కరూ ఆచరించి శ్రీకృష్ణ పరమాత్మలో ఐక్యం కావాలన్నారు. అనంతరం భగవద్గీతలను అందజేశారు. పాదలకూరు కమిటీ అధ్యక్షుడు జీ పెంచలనరసయ్య, సభ్యుల కార్తీక్, బీ కృష్ణయ్య, ఎం కొండయ్య, ఎంసీ సుధాకరాచారి, ఈ పెంచలయ్య, ఈ శేషాద్రి, కే గోపి, పీ గాయత్రి, పీ జాహ్నవి, వై పెంచలయ్య, ఎం పెంచలస్వాది తదితరులు పాల్గొన్నారు.

చిరస్థాయిగా సుబ్బరామిరెడ్డి సేవలు



మాట్లాడుతున్న చంద్రా రాజగోపాల్

ఆత్మకూరురూరల్: రైతాంగ సమస్యల పరిష్కారం, సీపీఎం పటిష్టత కోసం చెర్లో సుబ్బరామిరెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని సీపీఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రా రాజగోపాల్ అన్నారు. ఇటీవల మరణించిన చెర్లో సుబ్బరామిరెడ్డి సంతాప సభను పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు. 86 ఏళ్ల సంపూర్ణ జీవితాన్ని గడిపిన సుబ్బరామిరెడ్డి అప్పట్లో తాను నివశిస్తున్న వీధిలోనే పార్టీని ప్రారంభించి పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం క్రిస్టియన్‌పేటలో ఉన్న సీపీఎం భవన నిర్మాణంలోనూ ఆయన కృషి ఉందన్నారు. నెల్లూరులో రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల నిర్మాణానికి తన వంతు తోడ్పాటును అందించారన్నారు. రైతు సంఘాల నాయకుడు డాక్టర్ ఎంవీ రమణారెడ్డి, మూలి వెంగయ్య, డాక్టర్ జీ సుధాకర్ రెడ్డి, కేవీ శేషారెడ్డి, జీవీ ప్రసాద్, తదితరులు సుబ్బరామిరెడ్డి సేవలను కొనియాడారు. బీజేపీ సీనియర్ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది జెక్కా శేషమ్మ, లక్కు ప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచికంటి ఆశ్రమ సేవలు ఎనలేనివి



సుబ్బరామప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చింతం సుబ్బారెడ్డి

సీతారామపురం : మండలంలోని బసినేనిపల్లిలోని మంచికంటి సుబ్బరామ ప్రసాద్ వృద్ధాశ్రమం సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి కొనియాడారు. ఆదివారం వృద్ధాశ్రమంలో నిర్వహించిన దివంగత సుబ్బరామప్రసాద్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. వ్యాపారరీత్యా కర్నూలులో స్థిరపడిన మంచికంటి సుబ్రహ్మణ్యం సొంత ఊరిపై ఉన్న మమకారంతో లక్షలాది రూపాయల సొంత నిధులు వెచ్చించి తన కుమారుడు సుబ్బరామప్రసాద్ పేరు మీద వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి గత కొన్నేళ్లుగా ఎందరో అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. తొలుత సుబ్బరామ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ గ్రాంట్లు మంజూరు చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు: పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం గ్రాంట్లు విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పేరారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఆత్మకూరు డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. 117 జీఓ రద్దు, పాఠశాలల నిర్వహణలో గ్రాంట్లు మంజూరు, తదితర అంశాలపై చర్చించారు. పదో తరగతి తెలుగు మీడియం పరీక్షల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తెస్తున్న విషయాలను, అపార్ ఐడీ క్రియేషన్‌లో ఎదుర్కొంటున్న ఆన్ గోయింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంల సంఘం గౌరవాధ్యక్షుడు ఎంవీ చలపతి, కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి చలపతి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ బుజ్జయ్య, వెంకటేశ్వరరావు, సాయిప్రసాద్‌తో పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లలితా రుద్రయజ్ఞం



లలితా రుద్రయజ్ఞంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠంలో లోకకల్యాణం, సమృద్ధిగా పాడి పంటలు పండాలని 45 రోజుల పాటు నిర్వహిస్తున్న లలితా రుద్ర మహాయజ్ఞం కొనసాగుతోంది. ఆదివారం 18వ రోజు అత్యంత వైభవంగా పూజలు, కుంకుమార్చన, సకల దేవతాయజ్ఞం, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పౌర్ణమి రోజు అమ్మవారు 16 రూపాల్లో దర్శనమిస్తారని, ఆ రోజు అమ్మవారిని దర్శించి పూజించి ధ్యానిస్తే గొప్ప ఆశీస్సులు పొందుతారని ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న విక్రమ సింహపురి వర్సిటీ అంతర్ కళాశాలల మొదటి దశ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.